క్లుప్తంగా

పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నేడు

పద్మనాభం : మండలంలోని విలాస్కాన్‌పాలెంలో గల రామలింగేశ్వర ఆలయంలో బుధవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయం ముందు పందిరి వేశారు. సాయంత్రం ఆరు గంటలకు పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరుపుతామని అర్చకులు తెలిపారు.

10న రక్తదాన శిబిరం

తగరపువలస: చిట్టివలస సత్యసాయి సేవా సమితి ఆవరణలో ఈ నెల 10న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు సమితి ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించే శిబిరంలో దాతలు ఆధార్ కార్డుతో వస్తే లక్ష రూపాయల విలువ చేసే ఉచిత ఆరోగ్య బీమా, రూ.2 లక్షల విలువ చేసే ప్రమాద బీమా చేయనున్నట్టు తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


అన్నసమారాధన చేస్తున్న నాయకులు

కొమ్మాది : జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పిల్లలకు చిత్రలేఖన, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక నాయకులు సియాద్రి కనకరాజు, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, గుంటుబోయిన శ్రీనివాస్ యాదవ్, తదితరులు పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు 'అవంతి' విద్యార్థిని


రజనిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : ఈ నెల 12 నుంచి 14 వరకు న్యూఢిల్లీలోని కె.డి.జాదవ్ ఇండోర్ స్టేడియం, ఐజీ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి జూడో ఛాంపియన్‌షిప్ పోటీలకు చెరకుపల్లి అవంతి డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం.రజని ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో ఆమెను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ పిన్నింటి రామకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రోత్సాహకంగా రూ.5 వేలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తగరపువలస: తగరపువలస – భీమిలి రహదారిలో మరడపాలెం వద్ద ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో నమ్మి చరణ్‌తేజ్, జెన్నీ అనే ఇద్దరు ఇంటర్ విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ట్యూషన్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వీరిని నేరెళ్లవలసకు చెందిన ఇద్దరు వ్యక్తులు మరొక ద్విచక్ర వాహనంతో మద్యం మత్తులో వచ్చి గట్టిగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో చరణ్‌తేజ్ కాలు మూడు చోట్ల విరిగిపోయింది. మరొక విద్యార్థి జెన్నీకి తీవ్ర గాయాలయ్యాయి. చరణ్‌తేజ్ నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రిలో, జెన్నీ సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థులు ప్రమాదం కారణంగా మంగళవారం ఇంగ్లిష్ పరీక్షకు హాజరు కాలేకపోయారు. దీనిపై క్షతగాత్రుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శరవేగంగా ఆయుర్వేద ప్రాజెక్ట్ పనులు


శిథిలావస్థలో ప్రస్తుత ఆయుర్వేద వైద్యశాల

- శొంఠ్యాంలో ఫార్మశీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ ఏర్పాటు
- రూ.6.67 కోట్లు విడుదల
- పాత భవనాల స్థానంలో కొత్తవి చురుగ్గా నిర్మాణం


శొంఠ్యాంలో నిర్మాణంలో ఉన్న ఆయుర్వేద ఫార్మశీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ భవనాలు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో ప్రతిష్టాత్మకమైన ఆయుర్వేద ఫార్మశీ, డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ, ఆయుర్వేద వైద్యశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడి నుంచే అన్ని ఆయుర్వేద వైద్యశాలలకు మందులు సరఫరా కానుండడంతో ఈ ప్రాజెక్టు రాష్ట్రానికే తలమానికం కానుంది. భీమిలి నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురానుంది. రాష్ట్రానికి మంజూరైన ఈ ప్రాజెక్టుని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో శొంఠ్యాంలో ఏర్పాటు చేస్తున్నారు. శొంఠ్యాంలో వందేళ్ల నుంచి ఆయుర్వేద వైద్యశాల నిర్వహిస్తున్నారు. దీన్ని గత ఏడాది ఆయుర్వేద హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌గా మార్పు చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ భవనాల నిర్మాణానికి గతేడాది అక్టోబర్‌లో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని శంకుస్థాపన చేశారు. కాగా రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్‌లోని ఆయుర్వేద ఫార్మశీ కేంద్రం నుంచే అన్ని ప్రాంతాలకు మందులు సరఫరా చేసేవారు. విభజన అనంతరం అక్కడి నుంచి మందుల సరఫరా నిలిచి పోవడంతో ఇతర ప్రాంతాల నుంచి మందులు కొనుగోలు చేసి ఆయుర్వేద ఆస్పత్రులకు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుని మంజూరు చేసి రూ.6.7 కోట్లు కేటాయించడంతో శొంఠ్యాంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ భవనాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలంలో మందుల తయారీ కేంద్రం, ఆ మందుల నాణ్యతను పరిశీలించే లేబొరేటరీ, మందుల నిల్వ కేంద్రంతోపాటు ఆయుర్వేద వైద్యశాల నిర్వహణకు అవసరమయ్యే భవనాలను నిర్మిస్తున్నారు. వివిధ వనాల నుంచి సేకరించిన వన మూలికలతో ఇక్కడ ఆయుర్వేద, యునాని, హోమియో మందులు తయారు చేస్తారు. ఏర్పాటు చేసే లేబొరేటరీలో మందుల నాణ్యత పరిశీలించి సరఫరా చేస్తారు. దీంతో ఈ ప్రాంతానికి రాష్ట్ర స్థాయి గుర్తింపురానుంది. యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఆరు నెలల్లో భవనాల నిర్మాణాలు పూర్తి చేసి కార్యాలయాలు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

తుని ఆస్పత్రిలో పింఛన్ అందజేత


విశాఖపట్నంలోని టీబీ ఆస్పత్రిలో సూరికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రవి


తుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది రిక్షా కాలనీ 39వ వార్డు సచివాలయానికి చెందిన వలంటీర్ కింతాడ విజయలక్ష్మి, గృహ సారథి గణపతి కాకినాడ జిల్లా తుని వెళ్లి పింఛన్ అందజేశారు. మధురవాడ జీవీఎంసీ జోన్ – 2కి చెందిన లబ్ధిదారుడు ఉపమాక అప్పారావు తుని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్నాడు.

దీంతో వలంటీర్ మధువాడ నుంచి తుని వెళ్లి పింఛన్ నగదు అందజేశారు.

టీబీ ఆస్పత్రిలో పింఛన్ అందజేత

పద్మనాభం : విశాఖపట్నంలోని టీబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధునికి వలంటీర్ కోరాడ రవి పింఛన్ నగదు అందజేశారు. మండలంలోని ఐనాడ పంచాయతీ యాతపేటకు చెందిన వృద్ధుడు బాడితమాని సూరి 20 రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ రవి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి సూరికి రూ.3 వేలు అందజేశారు. దీంతో వృద్ధుడు సూరి ఆనందంతో సీఎం జగన్‌బాబుకు రుణపడి వుంటానని పేర్కొన్నారు.

రమణారెడ్డికి అభినందనలు


పాల రమణారెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి కళ్లివానిపాలెంలో గల ప్రాథమిక పాఠశాలను సుమారు లక్ష రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు గ్రామ పెద్దలు అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమణా రెడ్డి మాట్లాడుతూ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో సమస్యను ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. పిల్లలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు తన వంతు సహాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వేముల ఈశ్వరరావు, ఎండ్రెడ్డి విష్ణు, బోర బంగారు రెడ్డి, గుడ్ల బాబూరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ నేడు

ఆనందపురం : మండల స్థాయిలో రిజిస్ట్రేషన్ చేసిన జగనన్న ఇళ్ల పట్టాలు మండలంలోని శొంఠ్యాం గ్రామంలో బుధవారం పంపిణీ చేయనున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అన్నవరంలో 62 మందికి కంటి పరీక్షలు


అన్నవరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

తగరపువలస : భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 62 మందికి ఎల్‌వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ సిబ్బంది పరీక్షలు చేశారు. వీరిలో 36 మందికి కళ్లజోళ్లు అవసరం కాగా వాటిని 15 రోజుల్లో అందించనున్నారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా చేయనున్నారు. కార్యక్రమంలో సంస్థ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహ, పైడినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మేరుగు ఎల్లాజీ, నాగరాజు, ధనరాజు, నూకరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది సాయికృష్ణ, సాయి, సంతోషి, దుర్గారావు, భూపతి, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో రోడ్డు నిర్మాణంపై నోటీసులు


రియల్ ఎస్టేట్ సంస్థ భవనం తలుపుపై అంటించిన నోటీసు వద్ద వీఆర్వో నాయుడు

ఆనందపురం : మండలంలోని ముకుందపురంలో చెరువులో రోడ్డు నిర్మాణంపై తహసీల్దార్ హేమంత్ కుమార్ మంగళవారం రియల్ ఎస్టేట్ సంస్థ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ముకుందపురం గ్రామంలో శ్రీ సాయి ఐశ్వర్య డెవలపర్స్ సంస్థ లే అవుట్ వేసింది. ఆ లే అవుట్‌ని ఆనుకుని సర్వే నంబరు 72లో 23.35 ఎకరాల్లో విస్తరించి ఉన్న చెరువు ప్రాంతంలో సుమారు 50 సెంట్లు ఆక్రమించి రోడ్డు నిర్మిస్తున్నట్టు తెలుసుకున్న రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. చెరువు స్థలంలో రోడ్డు నిర్మాణం నిజమేనని నిర్ధారించుకున్నారు. ఈ మేరకు సంబంధిత రియల్ ఎస్టేట్ సంస్థ యాజమాన్యానికి నోటీసులు జారీ చేయడానికి నిర్ణయించారు. కాగా సంస్థకు సంబంధించి సరైన చిరునామా లేకపోవడంతో లే అవుట్‌లోని సంస్థ భవనంపై వీఆర్వో నాయుడు నోటీసులు అంటించారు. వారం రోజుల్లోగా స్థలానికి సంబంధించిన పూర్తి ఆధారాలు సమర్పించాలని, లేనిపక్షంలో చెరువులో నిర్మించిన రోడ్డుని తొలగిస్తామని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ పూర్తి విచారణ అనంతరం సరైన ఆధారాలు సమర్పించకపోతే అక్రమంగా నిర్మించిన రోడ్డుని తొలగిస్తామని చెప్పారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే వేడుకలు



వేడుకల్లో పదో తరగతి విద్యార్థులు

తగరపువలస: భీమిలి జీవీఎంసీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు మంగళవారం ప్రధానోపాధ్యాయుడు చెట్టి సింహాచలం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా 26 మంది విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో 9వ తరగతి విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు పండరీనాథ్, నయీమ్, సుజాతకుమారి, అల్లాడ శ్రీనివాసరావు, వెంకటరావు, రామకృష్ణ, కేటీవీ లక్ష్మి, అశోక్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం


బోయివీధిలో ప్రారంభించిన కుట్టు శిక్షణ కేంద్రం

తగరపువలస : జీవీఎంసీ 3వ వార్డు బోయి వీధిలో మంగళవారం సకల్య స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయంతో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని గ్రామ పెద్దలు కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు, అరసవిల్లి పోలిరాజు, చింతల ఎల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి, అనంతరం సర్టిఫికెట్లు అందిస్తారన్నారు. దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మాటిల్డ్, షకీల, జ్యోతి, జాలారుల సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే ముత్తంశెట్టి వినతి


హెలిప్యాడ్ వద్ద సీఎం జగన్ మోహన్ రెడ్డితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస / మధురవాడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం విశాఖ పర్యటన సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రెండు వినతిపత్రాలు అందించారు. గత నెల 26న పీఎం పాలెం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ పోతిన సాయి విజయ్ పవన్ కల్యాణ్‌కుమార్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో హత్యకు గురైన విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. పవన్ హత్యతో ఆ కుటుంబం ఆధారం కోల్పోయినందున ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

- భీమిలి నియోజకవర్గంలో నాగవంశం, నగరాలు సామాజిక వర్గాల ప్రజలు ఎక్కువ మంది వున్నందున వారు శుభకార్యాలు చేసుకునేందుకు కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మండపాలకు స్థలాలు కేటాయించాలని కోరారు. నగరాలు కులస్తులకు మధురవాడలో, నాగవంశం వారికి పద్మనాభంలో 50 సెంట్లు వంతున స్థలంతోపాటు భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ


పసుపు - కుంకుమ ప్యాకెట్లు, నాణేల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి


బిస్కట్లు, గులాబీల అలంకరణలో మజ్జివలస రాస పోలమాంబ

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మవారిని మంగళవారం పసుపు – కుంకుమ ప్యాకెట్లు, నాణేలు, గజమాలలతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన అలంకరణకు నందిక వెంకటరమణ, విజయలక్ష్మి సహాయ సహకారాలు అందించారు. అమ్మవారిని భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు అలంకరించారు.

- భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబను బిస్కట్లు, గులాబీలతో అలంకరించారు. ఈ అలంకరణకు మజ్జివలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు సహకరించగా తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

పద్మనాభం : విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు బంగారు బాటలు వేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తమ ప్రభుత్వం ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫారం అందజేస్తుందన్నారు. జగనన్న గోరు ముద్ద పథకం కింద పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులను ఎంపీపీ సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బుగత సత్యనారాయణ, బాందేవుపురం కో – ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు, ఆసరా స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకుడు రెడ్డిపల్లి జగదీష్ బాబు, హెచ్‌ఎం శాంతి ప్రసూన పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు


నరసింగరావు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీకి చెందిన దీనబోయిన నరసింగరావు గత నెల 29న ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. భార్య గౌరి ఈ మేరకు భీమిలి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. కూలి పనులు చేస్తూ జీవించే నరసింగరావు మద్యానికి బానిస కావడంతోపాటు మానసిక స్థితి బాగాలేదు. గతంలో పలుమార్లు వెళ్లిపోయిన నరసింగరావు ఒకటి రెండు రోజుల తర్వాత ఇంటికి వచ్చేవాడు. భీమిలి హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లపై మురుగునీటి ప్రవాహం


రహదారిపై నాచుకట్టిన మురుగు


సుఖీభవ కాలనీ సమీపంలో సర్వీస్‌రోడ్డుపై మురుగునీరు


ఇదదాసరిపేట వద్ద అపార్ట్‌మెంట్లకు డ్రైనేజీలు లేక రహదారిపై నిలిచిన మురుగునీరు

బిల్డర్ల నిర్వాకంతో నివాసులకు ఇబ్బందులు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు జాతీయ రహదారిని ఆనుకుని సంగివలస, వలందపేట, ఆదర్శనగర్ గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లపై మురుగునీటి ప్రవాహంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ జాతీయ రహదారిని ఆనుకుని ఇదదాసరిపేట, ఉళ్లపేటలో బిల్డర్లు డ్రైనేజీలు లేకుండా అపార్ట్‌మెంట్లు నిర్మించి విక్రయాలు జరిపారు. దీంతో అపార్ట్‌మెంట్ వాసుల వాడుక నీరు గత వారం రోజులుగా జాతీయ రహదారిని ఆనుకుని సర్వీస్‌రోడ్ల వరకు ప్రవహిస్తోంది. అలాగే జాతీయ రహదారుల సంస్థ నిర్మించిన డ్రైనేజీలు పూడికతో నిండిపోవడంతో నిత్యం మురుగునీరు సర్వీస్ రోడ్లపై నుంచి ప్రవహిస్తోంది. గతంలో ఈ డ్రైనేజీలు నిర్మించినప్పుడు శ్లాబు కోసం వేసిన కర్రలు, గ్రావెల్ తొలగించకపోవడం కూడా మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలిగినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్లపై మురుగునీటిలో వాహనాల రాకపోకల కారణంగా నడిచి వెళ్లేవారిపై బురద తుళ్లుతోందని అంటున్నారు. ఇదదాసరిపేట వద్ద రెండు అపార్ట్‌మెంట్లలో ఉన్నవారు అండర్ గ్రౌండ్‌లో ఉన్న చిన్నపాటి పైప్‌లైన్‌కు అడ్డం పడిన చెత్తను తొలగించినా మురుగునీటి సమస్య తీరలేదు. అంతేకాకుండా అపార్ట్‌మెంట్ల వరుసలో రహదారిని సైతం కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో స్థానికులు మురుగు నీటిలో నుంచి రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా భీమిలి టౌన్ ప్లానింగ్ విభాగం వారు డ్రైనేజీలు లేని అపార్ట్‌మెంట్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే జాతీయ రహదారుల డ్రైనేజీల అడుగున మిగిలిపోయిన చెత్తను తొలగించి మురుగునీటి ప్రవాహానికి ఇబ్బంది కలగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆదర్శనగర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన


అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో రూ.15 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో వున్న సమస్యలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో పరిష్కరించినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, వార్డు కార్యదర్శి వంశీరెడ్డి, సీనియర్ నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల నరసింగరెడ్డి, సరగడ నాగిరెడ్డి, చేట్ల అప్పలసూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు

ఆనందపురం : స్థానికంగా ఉన్న జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆనందపురం జంక్షన్‌లో అన్నదానం చేశారు. జై జవాన్ ఫౌండేషన్ స్థాపించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ఆనందపురం జంక్షన్‌లో అభాగ్యులకు, వివిధ పనులపై వచ్చిన వారికి, ప్రయాణికులకు సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక వైస్ చైర్మన్ ముడసల శ్రీను మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు విరివిగా నిర్వహించి రక్తాన్ని సేకరించి ప్రమాదంలో ఉన్న వారికి సాయపడుతున్నామని తెలిపారు. పేద రోగులకు దాతల సాయంతో ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి ముడసల కార్తీక్, కోశాధికారి కుప్ప రామలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఇమంది శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.